# చేరికల హోరు.. గులాబీ జోరు..

- గ్రేటర్‌లో కుదేలవుతున్న ప్రతిపక్షాలు
- ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కీలక నేతలు
- కారెక్కిన మేడ్చల్ డీసీసీ సహా బీజేపీ గద్వాల్ జిల్లా అధ్యక్షుడు
- అన్ని నియోజకవర్గాల్లోనూ క్యూ కడుతున్న కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు
- అనేక నియోజకవర్గాల్లో ఆ రెండు పార్టీలకూ కరువైన సరైన నాయకత్వం

ఎన్నికల నగారా మోగిందంటే ఎక్కడ చూసినా రాజకీయ పార్టీల కోలాహలమే కనిపిస్తుంది. కానీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం విచిత్ర పరిస్థితి. ఏ నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లినా... గులాబీ జెండా, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు..నేతల సందడి తప్ప.. ప్రతిపక్ష పార్టీల హడావుడి కనిపించడం లేదు. ఇక... కాంగ్రెస్, బీజేపీలకు అనేక నియోజకవర్గాల్లో సరైన అభ్యర్థులే దొరక్కపోవడంతో అధిష్ఠానాలు సైతం అభ్యర్థుల జాబితాపై మీనమేషాలు లెక్కిస్తున్నాయి. పోటీ ఏకపక్షం అని తేలుతుండడంతో చాలా మంది కీలక నేతలు, శ్రేణులు ఆయా పార్టీలను వదిలి గులాబీ కండువాలు కప్పుకుంటున్నారు. ఈ క్రమంలోనే నిత్యం అన్ని నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది.

- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ)



సీతాఫల్‌మండి ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, చిత్రంలో కార్పొరేటర్ సామల హేమ

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ దూకుడు ఏకపక్షంగా సాగుతున్నది. యాభై రోజుల కిందే అభ్యర్థులను ప్రకటించడంతో అనేక నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఒక దఫా ప్రచారాన్ని ముగించి... రెండో దశ ప్రచారంలోనూ దూసుకెళ్తున్నారు. ఇదిలా ఉంటే ప్రతిపక్షాల వైపు నుంచి కనీస కదలిక లేకపోవడం ప్రజలను విస్మయానికి గురి చేస్తున్నది. ఇక కాంగ్రెస్ పార్టీకి గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో ఐదారు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో సరైన అభ్యర్థులే కరువయ్యారు. మొదటి జాబితాలో 14 స్థానాలు ప్రకటించినప్పటికీ ప్రధానమైనవి కొన్ని మాత్రమే ఉన్నాయి. దీంతో మేడ్చల్, ఉప్పల్, పాతబస్తీలోని బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో ఎగిసిపడిన అసంతృప్తి కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సైతం ఖంగు తినిపించింది. దీంతో రెండో జాబితా విడుదల చేసేందుకే ఆ పార్టీ జంకుతున్న పరిస్థితి. మరోవైపు బీజేపీది ఇంకా దయనీయమైన స్థితి. ముషీరాబాద్, అంబర్‌పేట్‌లో ఎంపీలను దింపేందుకు ప్రయత్నిస్తున్నా... వాళ్లు ససేమిరా అనడంతో అక్కడ సైతం అభ్యర్థులు దొరకడంలేదని తెలిసింది. దీంతో చెప్పుకోదగిన, సిట్టింగ్ స్థానమైన గోషామహల్‌లో మళ్లీ రాజాసింగ్ మాత్రమే దిక్కవ్వడంతో ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసి, టికెట్ ఇచ్చేందుకు పావులు కదుపుతున్నారు. రెండు పార్టీల పరిస్థితి ఇలా తయారవ్వడంతో బీఆర్‌ఎస్‌లోకి వలసలు నానాటికీ పెరిగిపోతున్నాయి.

## ఖాళీ అవుతున్న కాంగ్రెస్..

కాంగ్రెస్ మొదటి జాబితాను విడుదల చేయకముందే మేడ్చల్ జిల్లాలో భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్‌తో పాటు భారీ ఎత్తున కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు మూకుమ్మడి రాజీనామాలు చేసి బీఆర్‌ఎస్‌లో చేరడంతో అక్కడ పార్టీ దాదాపు ఖాళీ అయింది. మొదటి జాబితా వెలువడిన రోజే ఉప్పల్‌లో రాజీనామాల పర్వం కొనసాగింది. కీలకమైన నేత రాగిడి లక్ష్మారెడ్డితో పాటు పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీనికి తోడు ఏఎస్‌రావు నగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషతో పాటు ఆమె భర్త, కీలక నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి కూడా పార్టీకి రాజీనామా చేశారు. ఇదే నియోజకవర్గానికి చెందిన పీసీసీ మాజీ కార్యదర్శి జితేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ యాదగిరి, ఉప్పల్ పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎం. శ్రీను వంటి వారు కూడా పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లోకి వచ్చారు. వీరే కాదు... డివిజన్ స్థాయి నాయకులు వందలాదిగా కాంగ్రెస్ పార్టీని వీడగా, వీరి వెంట వేలాదిగా కార్యకర్తలు హస్తం నుంచి గులాబీ పార్టీలోకి వచ్చారు. మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన జిల్లెలగూడ కార్పొరేటర్ గౌరీశంకర్ ఆ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు గులాబీ కండువా కప్పుకున్నారు. ఎల్బీనగర్‌లో సీనియర్ కాంగ్రెస్ నేత మందా సత్యనారాయణరెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఇలాఖాలోనే..

గ్రేటర్ పరిధిలో ఒకట్రెండు స్థానాల్లో బీజేపీ ఉనికి కాస్త కనిపిస్తున్నప్పటికీ వలసలతో అక్కడ కూడా ఆ పార్టీ పరిస్థితి దయనీయంగా మారింది. ముఖ్యంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మూడు పర్యాయాలు గెలిచిన అంబర్‌పేటలో ఆ పార్టీకి భారీ షాక్ తగిలింది. బీజేపీ గ్రేటర్ పార్టీ మాజీ అధ్యక్షుడు, గద్వాల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వెంకట్‌రెడ్డి ఆయన భార్య, కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి సహా పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరడం సంచలనం సృష్టించింది. దీంతో పాటు జేపీ డివిజన్ ప్రెసిడెంట్ రమణానాయుడు, జీహెచ్ఎంసీ మైనార్టీ మోర్చా మాజీ అధ్యక్షుడు బషీరుద్దీన్ బీఆర్‌ఎస్‌లో చేరారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీలో ఉత్తరాది ప్రజల అసోసియేషన్లకు సంధాన కర్తగా ఉన్న ఉత్తమ్‌కుమార్ రాజ్ పురోహిత్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఉప్పల్‌లో బీజేపీ హబ్సిగూడ డివిజన్ కార్యదర్శి పాండునాయక్, కందుకూరులో ఎంపీటీసీ రాజన్, బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ టేకుల భాస్కర్‌రెడ్డి పార్టీని వీడి కారెక్కారు. ఎల్బీనగర్‌లో బీజేపీ రాష్ట్ర స్లమ్ సెల్ కన్వీనర్ పసుపుల హరిబాబు, బీజేపీ ఎస్టీ మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పాశం శ్రీశైలం, బీజేపీ రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు సీహెచ్ లక్ష్మి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ కమలానికి గుడ్‌బై చెప్పి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

## ప్రజా సంక్షేమమే ఎజెండా

- ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

సిటీబ్యూరో, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): 'మేం ఎన్నికల్లో పోరాడేది మా పలుకుబడిని, ప్రతిష్టను పెంచుకోవడానికి కాదు, ప్రజలకు అధికారం ఇవ్వడానికి.. ప్రజా సంక్షేమమే ఏకైక ఎజెండాగా ఎంఐఎం పార్టీ పనిచేస్తుంద'ని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. నగరంలో శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ప్రసంగించారు. దేశ రాజకీయాల్లో చాలా మంది నాయకులు తమ కోసం అన్నట్లుగా పని చేస్తుంటారని, ముఖ్యంగా ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోరని చెప్పారు. దీనికి భిన్నంగా ఎంఐఎం పార్టీ ప్రజల కోసమే అన్నట్లుగా తమ పార్టీ ప్రజా ప్రతినిధులు పనిచేస్తారన్నారు.

## కండువా కప్పి.. ఆహ్వానించి..

బీఆర్‌ఎస్‌లో చేరికలు




ఉప్పల్ అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాచారం ఎర్రగుంటకు చెందిన కాంగ్రెస్ నేతలు

మల్లాపూర్, అక్టోబర్ 21 : ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఉప్పల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మీర్‌పేట్ డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారు వాసుచారి, బి.శ్రీనివాస్, పి. నరేశ్ గౌడ్, భీష్మాచారి, నాగేశ్, భాస్కర్, జయమ్మ, లలిత, లక్ష్మి, కమలమ్మ, మరియమ్మ, భాగ్యలక్ష్మి, గౌసియా, చంద్రకాంత్, పరమేశ్ గిరి, నర్సింగ్‌రావు, నర్సింహ, శ్రీకాంత్, విశాల్, రాములు, యాదయ్య, చెన్నయ్య, రాములు, రాజేశ్, సుమారు రెండు వందల మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జె. ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు గొల్లూరి అంజయ్య, జి. శ్రీనివాస్‌రెడ్డి, మారుతీరావు, కాల నీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వీడి.. బీఆర్‌ఎస్‌లోకి..

రామంతాపూర్, అక్టోబర్ 21 : 25 ఏండ్లు కాంగ్రెస్‌లో పనిచేసిన నాచారం ఎర్రగుంటకు చెందిన 200 మంది ఆ పార్టీకి రాజీనామా చేసి ఉప్పల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డి సమక్షంలో శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై.. 150 మంది బీఆర్‌ఎస్‌లోకి..

దుండిగల్, అక్టోబర్ 21: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 32వ వార్డ్ రాజీవ్‌గృహకల్పకు చెందిన 150 మంది యువకులు స్థానిక కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కుత్బుల్లాపూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శనివారం స్థానికంగా ఉన్న కేజీఆర్ కన్వెన్షన్ వద్ద జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత కొలన్ గోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఫ్లోర్ లీడర్ పాండు, కార్పొరేటర్లు జగదీశ్‌యాదవ్, సురేశ్‌రెడ్డి, రవి, చందు, రవికాంత్, సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో పార్టీలో చేరుతున్న యువతకు గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

## మైనార్టీల మద్దతు బీఆర్‌ఎస్‌కే..

- అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత : ఎమ్మెల్యే దానం నాగేందర్
- బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు యువకులు



బీఆర్‌ఎస్‌లో చేరిన ఖైరతాబాద్ క్రిస్టియన్ యూత్ అధ్యక్షుడు కందుల దిలీప్ తదితరులతో ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, అక్టోబర్ 21: రాష్ట్రంలో అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తుండటంతో వారంతా బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. నియోజకవర్గం క్రిస్టియన్ యూత్ అధ్యక్షుడు కందుల దిలీప్‌తో పాటు పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో ఆయన నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సర్వమతాలను సమానంగా చూసే సంస్కృతి వచ్చిందన్నారు. ముస్లింలు, క్రైస్తవుల కష్టాలు గమనించిన ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు వారికోసం ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో కచ్చితంగా బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన దిలీప్‌తోపాటు నాయకులు బి.పీటర్, ఆంథోనీ దాస్, శంకర్. డానీ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్


బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు మహిళా నేతలు

ముషీరాబాద్, అక్టోబర్ 21: నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని ప్రజలకు బీఆర్‌ఎస్ అభ్యర్థి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ విజ్ఞప్తి చేశారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్ బ్రహ్మంగారి టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ సమక్షంలో 200 మంది మహిళలు బీఆర్‌ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వెయ్యి కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో పని చేసిన ఎమ్మెల్యే, ఎంపీలు నియోజకవర్గాన్ని ఏనాడు పట్టించుకోలేదని, చుట్టపు చూపుగా వచ్చి వెళ్లేవారన్నారు. నిత్యం జన మధ్య ఉండే వారికే ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు నచ్చి అన్ని వర్గాల వారు బీఆర్‌ఎస్‌లో చేరడానికి ముందుకువస్తున్నారని అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం ముఠా గోపాల్ నాయకత్వంలో ఘననీయమైన అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ అన్నారు. బీఆర్‌ఎస్ మహిళా నేతలు అనురాధ, ప్రేమలతారెడ్డి, గీతారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ముఠా జయసింహ, బి.శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, రవియాదవ్, శ్యామ్‌సుందర్, అస్లాం, మాధవ్, కవిత, శైలజ తదితరులు పాల్గొన్నారు.



శనివారం బేగంపేట డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ సనత్‌నగర్ అభ్యర్థి, మంత్రి తలసాని

## 350 మంది బీఆర్‌ఎస్‌లోకి..



సాహెబ్‌నగర్‌లో 200 మంది, వనస్థలిపురంలో 150 మంది శనివారం బీఆర్‌ఎస్ ఎల్బీనగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. - వనస్థలిపురం